క్లుప్తంగా

పాత పెన్షన్ అమలు చేయాలి



మాట్లాడుతున్న వెంకటరావు

విశాఖ విద్య: పాత పెన్షన్ అమలు చేయాలని డిఫెన్స్ కో–ఆర్డినేషన్ కమిటీ చైర్మన్ రెడ్డి వెంకటరావు అన్నారు. కాకానినగర్ నేవీ ఆఫీస్ వద్ద గురువారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధరల పెరుగుదలకు అనుగుణంగా పే కమిషన్ సందర్భంగా పెరుగుతున్న జీత భత్యాలకు అనుగుణంగా పెన్షన్ ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. సీఐటీయూ జిల్లా నాయకులు ఎస్. జ్యోతీశ్వర రావు మాట్లాడుతూ పాత పద్ధతిలో పెన్షన్ సాధించుకునే వరకు పోరాడాలన్నారు. అనంతరం సీడీఏ నావీ అడ్మిన్ ఆఫీసర్‌కు వినతిపత్రం అందజేశారు.

సాయి మందిరంలో సీతారామ కల్యాణం

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు గుల్లపాలెం మహాత్మాగాంధీ షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణలోని సద్గురు షిర్డీసాయిబాబా ఆలయం వద్ద శ్రీరామనవమి సందర్భంగా ఈ నెల 6వ తేదీన సీతారాముల కల్యాణం నిర్వహించనున్నట్లు షిర్డీ సాయిబాబా చారిటబుల్ ట్రస్ట్ (ఆలయ కమిటీ) ప్రతినిధులు గురువారం తెలిపారు. ఆదివారం ఉదయం 9.10 గంటలకు కల్యాణం ముహూర్తపు పూజ నిర్వహిస్తామన్నారు. కల్యాణంలో పాల్గొనే జంటలకు స్వామి వారి తలంబ్రాలతో పాటు ప్రసాదాలను అందిస్తామని వివరించారు.

పందుల నిర్మూలనకు చర్యలు



పందిపై రబ్బర్ బుల్లెట్ ప్రయోగించిన సిబ్బంది

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు పరిధిలో పందుల నిర్మూలనకు చర్యలు చేపట్టారు. ఈ ప్రాంతంలో పందుల సంచారం ఎక్కువ కావడంతో స్థానికులు చేసిన ఫిర్యాదులపై స్పందించిన జీవీఎంసీ అధికారులు గురువారం తమ సిబ్బందితో కలిసి రబ్బర్ బుల్లెట్ల సాయంతో పందుల నిర్మూలన చర్యలు చేపట్టారు. గుల్లలపాలెం, ఎంబజీ కాలనీ, జవహర్‌నగర్ తదితర ప్రాంతాల్లో పందుల బెడదకు పరిష్కారం చూపారు.

సీపీఐ సభను విజయవంతం చేయాలి

మల్కాపురం: సీపీఐ శత వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 11వ తేదీన జీవీఎంసీ గాంధీ బొమ్మ విగ్రహం వద్ద జరగనున్న సభను పార్టీ కార్యకర్తలంతా జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా నాయకులు కాండ్రేగుల సత్యంజనేయ పిలుపునిచ్చారు. సభను ఉద్దేశించి మల్కాపురం గ్రామమండలి వద్ద గురువారం జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న సత్యంజనేయ మాట్లాడుతూ సీపీఐ పార్టీ ఎంతో చరిత్ర గల పార్టీ అని, దేశంలో అనేక మంది నిరుపేదల సమస్యలపై తమ పార్టీ పోరాడి పరిష్కరించిన ఘనత తమ పార్టీదన్నారు. ఈ నెల 11వ తేదీన జరిగే సభకు తమ పార్టీ జాతీయ కార్యదర్శి కె.నారాయణ హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా పార్టీ మహిళా కార్యకర్తలకు విరాళాల సేకరణకు హుండీలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గుడాల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌సిటీ డిపోలో ఎన్ఎంయూ నిరసన



ఆర్టీసీ స్టీల్ సిటీ డిపోలో నిరసన వ్యక్తం చేస్తున్న ఎన్ఎంయూ నాయకులు

ఉక్కునగరం: ఆర్టీసీ కూర్మన్నపాలెం స్టీల్ సిటీ డిపోలో నేషనల్ మజ్దూర్ యూనియన్ (ఎన్ఎంయూ) ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం ఉదయం నుంచి కార్మికులు ఎర్ర బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. డిపోలో జరిగిన కార్యక్రమంలో డిపో కార్యదర్శి జి. సాయిరామ్ మాట్లాడుతూ గతంలో కార్మికుల భద్రత నిమిత్తం అప్పటి ఎండీ సురేంద్రబాబు ఉత్తర్వులను ఉల్లంఘించి ఇటీవల అనకాపల్లి డిపో నందు సిబ్బందిని సస్పెండ్ చేశారన్నారు. అదే విధంగా ఆర్టీసీ యాజమాన్యం రాష్ట్ర వ్యాప్తంగా ఇదే వైఖరితో వ్యవహరిస్తోందన్నారు.

ఆక్రమణలకు అడ్డేదీ..!



ఎయిర్ పోర్టుకు సమీపంలో గ్రీన్‌బెల్ట్‌ను తొలగించిన రెస్టారెంట్ నిర్వాహకులు



కాకానినగర్ వద్ద గ్రీన్ బెల్ట్‌ను సొంత అవసరాలకు వినియోగిస్తున్న దృశ్యం



విమాన్‌నగర్ వద్ద గ్రీన్ బెల్ట్‌ను తొలగించి ఇంటికి రహదారి ఏర్పాటు



ఎన్ఎస్‌టీఎల్‌కు ఎదురుగా పార్కింగ్ కోసం వినియోగిస్తున్న గ్రీన్ బెల్ట్ స్థలం

- ప్రభుత్వ స్థలాల్లో ప్రైవేటు వ్యాపారాలు
- గ్రీన్ బెల్ట్‌ను సైతం వదలని అక్రమార్కులు
- మాయమవుతున్న పచ్చదనం
- అనుమతుల్లేకుండానే రహదారుల నిర్మాణం
- చోద్యం చూస్తున్న జీవీఎంసీ అధికారులు

విశాఖ విద్య:

పశ్చిమ నియోజకవర్గంలో ప్రభుత్వ స్థలాలపై కూటమి నేతల కన్ను పడింది. కాలనీల్లో ఖాళీ స్థలం కనిపిస్తే చాలు, దానిలో పాగా వేసేస్తున్నారు. చివరకు గ్రీన్ బెల్ట్‌ను సైతం వదలటం లేదు. ఎయిర్‌పోర్టు నుంచి ఎన్ఎస్‌టీఎల్ వరకు ఉన్న జాతీయ రహదారిలో గ్రీన్‌బెల్ట్ కనుమరుగవుతోంది. కూటమి నేతల అండదండలతోనే ఈ తతంగం సాగుతుండటంతో జీవీఎంసీ అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎయిర్‌పోర్టు నుంచి ఎన్ఏడీ జంక్షన్‌కు వచ్చే దారిలో కొంతమంది గ్రీన్ బెల్ట్ స్థలాల్లోనే తమ వ్యాపారాలు సాగిస్తున్నారు. హైవే పక్కన ఉన్న విలువైన స్థలం ప్రైవేటు వ్యక్తులు ఆక్రమించేసుకుంటున్నా, తమకేమీ సంబంధం లేనట్లుగా జీవీఎంసీ, వీఎంఆర్‌డీఏ అధికారులు వ్యవహరిస్తుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మాయమవుతున్న పచ్చదనం: హైవేకు ఆనుకొని ఉన్న గ్రీన్ బెల్ట్ పరిరక్షణలో భాగంగా నిర్ణీత స్థలానికి జీవీఎంసీ ఆధ్వర్యంలో ఇనుప చువ్వలతో ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. హైవేపై ప్రయాణం హాయిగా సాగే క్రమంలో గ్రీన్ బెల్ట్‌ను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకని జీవీఎంసీ నిధులు వెచ్చించి మొక్కలను పెంచారు. ఎన్ఏడీ నుంచి ఎయిర్‌పోర్టు వరకు ప్రతీ రోజూ వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. ఈ నేపథ్యంలో ఇరువైపులా రెస్టారెంట్లు, పాన్ షాపులు, హోటళ్ల వంటివి ఏర్పాటు చేస్తే వ్యాపారం బాగుంటుందని భావిస్తున్న కొంతమంది ప్రైవేటు వ్యక్తులు కూటమి నేతల అండదండలతోనే ఇలా ఆక్రమణలకు పాల్పడుతున్నట్లు ప్రచారం సాగుతోంది.

దర్జాగా రోడ్డు నిర్మాణం

గ్రీన్ బెల్ట్‌ను కబ్జా చేసిన ప్రైవేటు వ్యక్తులు దానిలో తమ వ్యాపారాల నిర్వహణకు అనువుగా పటిష్టమైన రహదారి ఏర్పాటు చేసుకుంటున్నారు. చెట్లు నరికేసి, చెత్త చెదారం తొలగించిన చోట మట్టి కుప్పలతో ఎత్తుగా చేస్తున్నారు. హైవేకు ఆనుకొని ఉండటంతో ఇక్కడి వ్యాపారాలకు బాగానే గిరాకీ ఉంటుంది. జీవీఎంసీ, వీఎంఆర్‌డీఏ అధికారులు, సిబ్బంది భారీగా ముడుపులు తీసుకొని హైవేకు ఆనుకొని ఉన్న విలువైన స్థలాన్ని ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

ఇవి కనిపించటం లేదా..?:

- ఎయిర్‌పోర్టు నుంచి ఎన్ఏడీ జంక్షన్‌కు వచ్చే దారిలో విమాన్ నగర్ వద్ద ఓ రెస్టారెంట్‌కు గ్రీన్‌బెల్ట్‌లోనే పటిష్టమైన రహదారి నిర్మించారు.
- కాకానినగర్ వద్ద గ్రీన్‌బెల్ట్‌లో దుకాణాలు ఏర్పాటు కోసమని కంచె తొలగించి రోడ్డు వేశారు.
- కాకానినగర్ సిగ్నల్ పాయింట్‌కు సమీపంలో ఓ ఇంటి అవసరాల కోసమని గ్రీన్‌బెల్ట్‌ను తొలగించి, దారి ఏర్పాటు చేసుకున్నారు. ఇక్కడ గ్రీన్ బెల్ట్ స్థలాన్ని పూర్తిగా తమ సొంత అవసరాలకు వినియోగిస్తున్నారు.
- ఎన్ఎస్‌టీఎల్‌కు ఎదురుగా జీవీఎంసీ 52వ వార్డులో ఉన్న గ్రీన్ బెల్ట్ స్థలంలో అక్కడి మద్యం దుకాణదారులు, హోటళ్ల నిర్వాహకులు తమ సొంత పార్కింగ్ కోసమని వినియోగిస్తున్నారు.

కలెక్టర్ గారూ మీరైనా పట్టించుకోండి

హైవేకు ఆనుకొని ఉన్న గ్రీన్‌బెల్ట్ పరిరక్షణకు కలెక్టర్ దృష్టి పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఈ ప్రాంత వాసులు కోరుతున్నారు. జీవీఎంసీ కమిషనర్‌గా కూడా కలెక్టర్ వ్యవహరిస్తున్నందున, కోట్లాది రూపాయల విలువైన స్థలం కబ్జారాయళ్ల చేతుల్లోకి వెళ్లిపోకముందే తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. కబ్జారాయళ్లకు సహకరిస్తున్న స్థానిక అధికారులు, సిబ్బందిపై కఠినంగా వ్యవహరిస్తేనే, ఇలాంటి ఆక్రమణలకు అడ్డుకట్ట పడుతుందని ఈ ప్రాంత వాసులు అంటున్నారు.

సాధారణ ప్రసవం తల్లీబిడ్డకు ఆరోగ్యకరం



అవగాహన కల్పిస్తున్న స్త్రీ వైద్య నిపుణురాలు నివేదిత

గోపాలపట్నం: సాధారణ ప్రసవం తల్లికి బిడ్డకు ఎంతో ఆరోగ్యకరమైన ప్రక్రియ అని గోపాలపట్నం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సూపరింటెండెంట్ డాక్టర్ సుజాత అన్నారు. ఈ మేరకు ఆస్పత్రిలో గర్భిణులకు సిజేరియన్ వద్దు, సాధారణ ప్రసవాలు ముద్దు అనే అంశంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాలను ప్రోత్సహిస్తుందని తెలిపారు. స్త్రీ వైద్య నిపుణురాలు నివేదిత మాట్లాడుతూ సాధారణ ప్రసవం కావాలంటే గర్భిణులు తప్పనిసరిగా వైద్యులు సూచించిన వ్యాయామం చేయాలని అన్నారు. రోజుకు 7 నుంచి 8 గంటలు నిద్ర అవసరమని తెలిపారు. సిజేరియన్ తప్పనిసరి పరిస్థితుల్లో తల్లి బిడ్డలను కాపాడేందుకు చేయవలసిన ప్రక్రియ మాత్రమేనన్నారు. కార్యక్రమంలో వైద్యులు షబ్నమ్, ప్రవళ్లిక, స్టాఫ్ నర్స్ నాగలక్ష్మి, నర్స్ ఝాన్సీ, గర్భిణులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మల్కాపురం: శ్రీహరిపురం విద్యుత్ ఉప కేంద్ర కార్యాలయం పరిధిలో వార్షిక మరమ్మతుల కారణంగా సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని జోన్–2 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బీకే నాయుడు గురువారం తెలిపారు. 11 కేవీ శ్రీహరిపురం ఫీడర్ పరిధిలోని మార్కెట్ ఏరియా, పాత్రుడుకాలనీ (కోరమాండల్ గేట్), శ్రీహరిపురం మెయిన్ రోడ్డు, వీటీ కాలేజీ రోడ్డు ప్రాంతాలతో పాటు 11 కేవీ జవహర్‌నగర్ ఫీడర్ పరిధిలోని ఎక్స్ సర్వీస్‌మెన్ కాలనీ, జీవీఎంసీ ఆస్పత్రి (ఎఫ్ఆర్‌యూ ఆస్పత్రి) ప్రాంతం, ఎంబజీ వుడాకాలనీ–1, 2 ప్రాంతాలు, హనుమాన్ సంజీవ్ కాలనీ, నెహ్రూనగర్, అశోక్‌నగర్, కొత్త నక్కవానిపాలెం ప్రాంతాలకు శుక్రవారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

డ్రగ్స్ రహిత నగరంగా తీర్చిదిద్దుదాం

- యువత సహకారంతోనే సాధ్యం
- నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి
- విద్యార్థులకు అవగాహన సదస్సు



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు



డ్రగ్స్ వల్ల దుష్పరిణామాల గురించి విద్యార్థులకు వివరిస్తున్న సీపీ బాగ్చి

గోపాలపట్నం: సుందర విశాఖను మాదక ద్రవ్యాల రహిత నగరంగా మారుద్దామని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి అన్నారు. అందుకు విద్యార్థుల సహకారం అవసరమన్నారు. మాదక ద్రవ్యాలు, సైబర్ క్రైమ్ తదితర అంశాలపై గోపాలపట్నంలోని ఆదిత్య కళాశాలలో గురువారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. మాదకద్రవ్యాలు బయట వ్యక్తుల వల్ల అలవాటు అవుతాయని, అలాంటివారి పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ముందు సరదాగా మొదలైనా, తర్వాత అలవాటుగా మారి జీవితాలను నాశనం చేస్తుందని తెలిపారు. మాదక ద్రవ్యాల వల్ల శరీరంలో నాడీవ్యవస్థ దెబ్బ తింటుందని, సంతాన సామర్థ్యం తగ్గుతుందని దృశ్య మాధ్యమం ద్వారా వివరించారు. అలాగే సైబర్ నేరస్తుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సోషల్ మీడియాల్లో జరుగుతున్న మోసాల గురించి అవగాహనతో ఉండాలన్నారు. బెట్టింగ్ యాప్‌ల వల్ల ఇబ్బందుల్లో పడతారని హెచ్చరించారు. కళాశాలలో ర్యాగింగ్‌లకు పాల్పడవద్దని హితవు పలికారు. ఈగల్ సీఐ కల్యాణి మాట్లాడుతూ ఈగల్ పోలీస్ వ్యవస్థ మాదక ద్రవ్యాల నిర్మూలనకు ఏర్పాటైందని తెలిపారు. అసాంఘిక శక్తులను అరికట్టే విధంగా పనిచేస్తుందన్నారు. గంజాయి, డ్రగ్స్ వంటివి అమ్ముతున్నా, ఎవరి వద్దనైనా కలిగి ఉన్నా 1972 నంబర్‌కు ఫోన్ ద్వారా సమాచారమివ్వాలని సూచించారు. అనంతరం సీపీని కళాశాల ప్రిన్సిపాల్ మురళీ మోహనరావు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వెస్ట్ సబ్ డివిజన్ ఏసీపీ ఏబీ పృథ్వీతేజ, గోపాలపట్నం సీఐ గొలగాని అప్పారావు, ఎస్ఐ రామారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

పక్కాగా ఒంటి పూట బడుల అమలు

విశాఖ విద్య: వేసవి ఉష్ణోగ్రతలు అత్యధికంగా నమోదవుతున్న దృష్ట్యా అన్ని పాఠశాలల యాజమాన్యాలు ఒంటి పూట బడులు పక్కాగా అమలు చేయాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం గురువారం ఒక ప్రకటనలో సూచించారు. తొమ్మిది, పదో తరగతులకు ప్రత్యేక తరగతులు పేరిట రెండు పూటలా నిర్వహిస్తున్నట్లు తమ కమిషన్‌కు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఫిర్యాదులు అందజేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో ఎవరికీ ఎటువంటి మినహాయింపులు ఉండబోవని, ఒంటి పూట బడులు అమలు జరపాల్సిందేనన్నారు. తమ కమిషన్ ఆదేశాలు, ప్రభుత్వ ఉత్తర్వులు పాటించని పాఠశాలల యాజమాన్యాలపై డేగకళ్లతో పర్యవేక్షణ జరపడం తోపాటు ఆయా స్కూళ్ల గుర్తింపు రద్దు, క్రిమినల్ చర్యలకు వివిధ సిఫార్సులు చేస్తామని చెప్పారు.

కాంట్రాక్ట్ కార్మికురాలి మృతితో ఆందోళన



ఏఎంహెచ్‌వోతో వాగ్వాదానికి దిగుతున్న పారిశుధ్య కార్మికులు



భవాని (ఫైల్)

కూర్మన్నపాలెం: జీవీఎంసీ కాంట్రాక్ట్ కార్మికురాలు మృతి చెందింది. దీంతో ఆ కుటుంబానికి న్యాయం చేయాలని సహచర కార్మికులు గురువారం ఆందోళనకు దిగడంతో పరిస్థితి గందరగోళంగా మారింది. విషయం తెలుసుకున్న అధికారులు, పోలీసులు, యూనియన్ నాయకులు రంగంలోకి దిగి చర్యలు జరపడంతో ఆందోళన సద్దుమనిగింది. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలిలా.. వడ్లపూడి కణితి హైస్కూలు సమీపంలో నివాసముంటున్న పాకం గంగాభవాని (45) విధి నిర్వహణలో ఉండగా బుధవారం మధ్యాహ్నం సొమ్మసిల్లి పడిపోయింది. సమీపంలో ఉన్న కార్మికులు ఆమెను కూర్మన్నపాలెంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. మృతదేహాన్ని ఇంటికి తరలించిన కుటుంబ సభ్యులు, తోటి ఉద్యోగులు ఆమె కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ వాటర్ ట్యాంక్ సమీపంలో పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు.

కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, రూ.5 లక్షలు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. జీవీఎంసీ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు పడాల రమణ, సీఐ మల్లేశ్వరరావు, ఏఎంహెచ్‌ఓ, కుటుంబ సభ్యులు, దుర్గా కన్స్ట్రక్షన్స్ యాజమాన్యంతో చర్చించారు. రూ. 2.50 లక్షలు పరిహారం ఇవ్వడానికి, భవాని కుమారుడికి ఆ సంస్థలో ఉపాధి కల్పించడానికి అంగీకరించారు. అనంతరం కార్మికులు ఆందోళన విరమించి మృతదేహాన్ని అంతిమ క్రియలకు తరలించారు.

సాయిబాబా ఆలయంలో పూజలు



సాయిబాబా

మల్కాపురం : జీవీఎంసీ 60వ వార్డు గుల్లలపాలెం మహాత్మా గాంధీ షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణలోని సద్గురు షిర్డీ సాయిబాబా ఆలయంలో గురువారం ఉదయం ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ సందర్భంగా తెల్లవారుజామున ఆరు గంటలకు బాబాకు ఆలయ అర్చకులు చంద్రశేఖర్ శర్మ హారతి పూజలు నిర్వహించారు. ఉదయం 8 గంటలకు బాబాకు పంచామృతాలు, విభూదితో అభిషేకాలు చేపట్టి, సుగంధ మాలలు, పట్టు వస్త్రాలతో అలంకరించారు. మధ్యాహ్నం సుమారు రెండు వందల మందికి అన్న సమారాధన నిర్వహించారు. సాయంత్రం బాబాకు పల్లకీ సేవ, హారతి పూజలు చేపట్టారు. ఈ పూజా కార్యక్రమంలో పారిశ్రామిక ప్రాంతం నలుమూలల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని బాబాను దర్శించుకుని, పూజలు చేశారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌పై దృష్టి సారించండి

అల్లిపురం: స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వేపై ప్రత్యేక దృష్టి సారించాలని జోన్–4 జోనల్ కమిషనర్ మల్లయ్యనాయుడు సూచించారు. ఈ మేరకు వెంకటేశ్వరమెట్ట సచివాలయంలో జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొన్నారు. గ్రేటర్ విశాఖ మంచి ర్యాంకు సాధించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని సచివాలయం సిబ్బంది, ఆర్పీలను కోరారు. ప్రజలను కలిసి వారి ఫీడ్ బ్యాక్ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ టి.సీతారామయ్య, ఆర్పీలు పాల్గొన్నారు.

కార్పొరేషన్ల రుణాలకు ఇంటర్వ్యూలు నేడు

పరవాడ: మండలంలో వెనుకబడిన తరగతుల కార్పొరేషన్ల నుంచి సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 4న స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వి.ధర్మారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 14 గ్రామ పంచాయతీల పరిధిలో ఈ రుణాల కోసం 308 మంది దరఖాస్తు చేసుకున్నట్లు పేర్కొన్నారు. వీరిలో 114 మందిని ఎంపిక చేయనున్నారు. వివిధ బ్యాంకుల మేనేజర్లు, కార్పొరేషన్ల అధికారులు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని తెలిపారు.

ఛత్రపతి శివాజీకి నివాళి



శివాజీ మహరాజ్‌కు నివాళులు అర్పిస్తున్న నాయకులు

మల్కాపురం: మరాఠా యోధుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ వర్ధంతిని పురస్కరించుకుని ఆయనకు ఘన నివాళులు అర్పించారు. 60వ వార్డు శ్రీహరిపురం వద్ద స్థానిక బీజేపీ నాయకుడు పెద్దిరెడ్ల నానాజీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. హిందూ ధర్మ పరిరక్షణకు శివాజీ చేసిన త్యాగాలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో సతీష్, అనీల్, కనక, జ్యోతి పాల్గొన్నారు.

కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని నిరసన



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న యూనియన్ నాయకులు

సీతమ్మధార: వీఎంఆర్‌డీఏ పరిధిలోని వివిధ పార్కుల్లో గత 30 ఏళ్లుగా పని చేస్తున్న 11 మంది గార్డెన్ కార్మికులను వుడా అధికారులు అన్యాయంగా తొలగించారని ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ప్రధాన కార్యదర్శి వి.కృష్ణారావు డిమాండ్ చేశారు. గురువారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద తొలగించిన కార్మికులతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ వీరిని తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని లేదా పని చేసిన కాలానికి గ్రాట్యుటీ, బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. వుడాలో సొసైటీ కార్మికులుగా ఉన్న 11 మందిని 60 ఏళ్లు నిండాయన్న నెపంతో తొలగించడం దుర్మార్గమని, రాష్ట్ర ప్రభుత్వం 62 ఏళ్ల వయో పరిమితి పెంచిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. గార్డెన్ కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్, వారాంతపు, ప్రభుత్వ, పండగ సెలవులు, గ్రాట్యుటీ వంటి ఏ కార్మిక చట్టాలు అమలు చేయడానికి అధికారులు, వుడా చెర్మన్, కార్మిక శాఖ అధికారులు ఎందుకు పూనుకోవడం లేదని ప్రశ్నించారు. వీరిని తొలగించి 6 నెలలు కావస్తున్నా వుడా కమిషనర్, చెర్మన్, డీసీఎల్ ఎటువంటి చర్యలు తీసుకోకపోవడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. ఇప్పటికైనా తొలగించిన కార్మికులకు న్యాయం చేయాలని, లేదంటే కుటుంబాలతో వీఎంఆర్‌డీఏ కార్యాలయం ఎదుట దీక్ష చేపడతామన్నారు. ఈ ధర్నాలో కార్మికులు రాంబాబు, శ్రీను, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

సీతారాముల కల్యాణానికి చురుగ్గా ఏర్పాట్లు



కల్యాణోత్సవాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఈవో శోభారాణి తదితరులు

డాబాగార్డెన్స్: జగదాంబ జంక్షన్ సమీపాన మహారాణిపేట అంబికాబాగ్ రామాలయంలో శ్రీరామ నవమికి సీతారాముల కల్యాణం ఏర్పాట్లు ఊపందుకున్నాయి. ఈ నెల 7 వరకు నిర్వహించనున్న కల్యాణ మహోత్సవాలకు సన్నాహాలు పూర్తయ్యాయి. ఈ మేరకు ఉత్సవాలకు సంబంధించి గురువారం ఆలయ ప్రాంగణంలో ఈవో కె. శోభారాణి వివరాలు వెల్లడించి పోస్టర్ ఆవిష్కరించారు. ఈ నెల 6న సీతారామచంద్రస్వామి కల్యాణోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్టు చెప్పారు. 7న శ్రీరామ పట్టాభిషేకం వేడుకగా నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. కల్యాణం చేయించుకోదలిచే భక్తులు 0891–2528645, 2566514 నంబర్లలో సంప్రదించాలన్నారు. శ్రీరామనవమి కల్యాణ మహోత్సవంలో పాల్గొనదలిచే ఉభయదాతలు రూ.1,116 చెల్లించి, రసీదు పొంది కార్యక్రమంలో పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో కె.ఎస్. తిరుమలేశ్వరరావు, ప్రధాన అర్చకుడు తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చన ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం జరిపారు. 108 స్వర్ణ సంపెంగలతో అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేష వస్త్రాలను అందించారు.

వైభవంగా నిత్యకల్యాణం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేశారు. ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్య ధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని ఘనంగా జరిపారు. ఉభయ దాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.